సాక్షి ఒడిశా

ఆదివారం। 14। సెప్టెంబర్। 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,00,182
బంగారం	4 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
వెండి	91 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు

యువత పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు అధిరోహించవచ్చని గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. – 8లో



ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

అవిభజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంక్) ఆన్‌లైన్ సేవలను శనివారం ప్రారంభించారు. – 8లో

న్యూస్‌రీల్

మౌలిక సదుపాయాలపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో గజపతి జిల్లాలోని ఆకాంక్ష సమితి కేంద్రాలు గుమ్మ, ఆర్.ఉదయగిరిల్లో వ్యవసాయ వనరులు, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై జిల్లాస్థాయి రెవెన్యూ, వ్యవసాయ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ మధుమిత శనివారం నిర్వహించారు. 2026 నాటికి వికసిత రాష్ట్రం దిశగా జిల్లాలో ఆరు క్షేత్రాల్లో అభివృద్ధిపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో విద్యాశాఖ, వ్యవసాయ, సామాజిక సంక్షేమ, మిషన్ శక్తి, హెల్త్ మిషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకుడిపై మొసలి పిల్ల దాడి



పట్టుబడిన మొసలి పిల్ల

భువనేశ్వర్: కోణార్కు చంద్రభాగ సాగర తీరంలో ఒక మొసలి పిల్ల పర్యాటకుడిపై దాడి చేసింది. దీంతో పర్యాటకులు బెంబేలెత్తిపోయారు. తక్షణమే అనుబంధ వర్గాలు రంగంలోకి దిగి మొసలి పిల్లని పట్టుకున్నారు. ఇది కుశభద్ర నది నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. తల్లి మొసలి ఈ తీరంలో ఉంటుందనే అనుమానంతో గాలిస్తున్నారు.

కాలువలో పడిన గున్న ఏనుగు



కాలువలో పడిన ఉన్న గున్న ఏనుగు

భువనేశ్వర్: అంగుల్ జిల్లా అఠొమల్లిక్ అటవీ శ్రేణిలోని పంచధార కొండ సమీపంలో ఉన్న కాలువలో గున్న ఏనుగు పడిపోయింది. దాని వయస్సు సుమారు 2 నెలలు ఉంటుందని భావిస్తున్నారు. కాలువలో పడిన గున్న ఏనుగుని గుర్తించిన స్థానికులు అటవీ శాఖకు సమాచారం అందించారు. అటవీ, పశుసంవర్ధక అధికారుల సంయుక్త బృందం ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గున్న ఏనుగును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఏనుగు తల వెనుక, ముందరి కాళ్ల పైభాగంపై గాయాలయ్యాయి. వన్య ప్రాణుల వైద్య బృందం చికిత్స చేసి సమీపంలోని అడవిలోకి విడిచిపెట్టారు. ఆ ప్రాంతంలో దాని కదలికని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏనుగు రోదనని ఆలకించిన తల్లి ఏనుగు పరిసరాలకు చేరిన గున్న ఏనుగుని అక్కున చేర్చుకునేందుకు నిరాకరించడంతో అటవీ శాఖ అధికారులు గమనిస్తున్నారు. మరోవైపు గున్న ఏనుగు ఆహారం తినడానికి నిరాకరించడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



నాటుసారాతో పట్టుబడిన బిడిక

రాయగడ: అబ్కారీ శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో నాటుసారాతో ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడు పంచానన్ బిడికను అధికారులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అతని వద్ద నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రాయగడ సమితి పరిధి చందిలి, జేకేపూర్‌లలో నిర్వహించిన దాడుల్లో భాగంగా నాటుసారాను విక్రయించేందుకు వెళ్తున్న బిడికను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకొని అరెస్టు చేశారు.



• గొంతెండుతోంది..!

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని కాసీపూర్ సమితి దుడుకాబహాల్ గ్రామానికి చెందిన మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలను పట్టుకుని రోడ్డుపై నిరసన తెలిపారు. గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని గొట్టపు బావులు సరిగా పనిచేయకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. మహిళల ఆందోళనతో రాయగడ మీదుగా టికిరి, కాసీపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. – రాయగడ

కొరాపుట్‌లో కూలిన భవనం

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



కూలిన భవనం శిథిలాలు తొలగిస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లా కేంద్రంలో పాత భవనం కూలిన ఘటన ప్రజలను ఉలిక్కిపాటుకు గురిచేసింది. శనివారం మధ్యాహ్నం పట్టణ నడిబొడ్డున ఎస్పీ కార్యాయలం ఎదుట ప్రధాన జంక్షన్ వద్ద ఉన్నటువంటి హరిహర బేకరీ భవనం కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో యజమాని పి.లోక్‌నాథ్ పాత్రో(60) భవనం శిథిలాల్లో చిక్కుకుపోయారు. అలాగే మరోవ్యక్తి అచేతనంగా సమీపంలో పడిపోయాడు. వెంటనే పోలీసు, అగ్నిమాపక, ఓడ్రాఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. పడిపోయిన వ్యక్తిని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి తరలించారు. హైడ్రాలిక్ పద్ధతిలో శిథిలాలు తొలగించి లోక్‌నాథ్‌ను వెలికి తీశారు. అయితే అతడిని ఆస్పత్రికి తరలించే సరికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

మరమ్మతులు చేపడుతుండగానే...

గత రెండు నెలలుగా భారీ వర్షాలతో ఈ రెండస్తుల భవనం గోడలు బాగా తడిసి ఉన్నాయి. ఇంతలో భవనం మరమ్మతులు ప్రారంభించారు. కొన్నిచోట్ల గోడలకు రంధ్రాలు పెట్టారు. పురాతనమైన ఈ భవనానికి పిల్లర్లు కూడా లేవు. దీంతో కుప్పకూలినట్లు తెలుస్తోంది. మధ్యాహ్న సమయం కావడంతో మరమ్మతులకు వచ్చిన కార్మికులు భోజనాలకు బయటకు వెళ్లడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఘటనతో సునాబెడా – కొరాపుట్ – జయపూర్ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్పీ రోహిత్ వర్మ, ఇతర అధికారులు చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. విషయం తెలిసిన వెంటనే కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి, కొరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘురాం పోడాల్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

వేరుశనగ డబ్బులు చెల్లించాలి



బొయిపరిగుడ పోలీసుస్టేషన్ వద్ద రైతులు

జయపురం: తాము మూడు నెలల క్రితం అమ్మిన వేరుశనగ డబ్బులను ఇప్పటికైనా చెల్లించాలని కోరుతూ రైతులు కదం తొక్కారు. ఈ మేరకు బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు బొయిపరిగుడ సమితి బోదాపుట్, దశమంతపూర్ పంచాయతీల నుంచి అనేక మంది రైతులు శనివారం వెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాము పంటను బొయిపరిగుడ లేంప్స్ మండీలో అమ్మామని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండీలో అమ్మిన 24 గంటల్లోపు ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉన్నా.. ఇంతవరకు చెల్లించడంలో తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. రెండు పంచాయతీలకు చెందిన రైతులు అనేకసార్లు లేంప్స్ కార్యాలయానికి వెళ్లి అడుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయం గత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీంతో వెంటనే బొయిపరిగుడ పోలీసు అధికారి డొంబురుదొర బత్రియ లేంప్ అధికారులకు ఫోన్‌చేసి స్టేషన్‌కు రప్పించారు. రైతుల సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని సదరు అధికారి హామీ ఇచ్చారు. అయితే సమస్యను త్వరితగతిన పరిష్కరించకుంటే లేంప్స్ కార్యాలయానికి తాళాలు వేస్తామని రైతులు హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణానికి కలెక్టర్‌కు వినతి



వినతిపత్రంతో గుమ్మబ్లాక్ గైబ, బురుడా పంచాయతీ ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్‌లోని గైబ గ్రామ పంచాయతీలో బురుడా గ్రామం నుంచి శియ్యాళీ గ్రామ పంచాయతీ పెద్దమడి వరకు ఉన్నటువంటి 6 కి.మీ రహదారి ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ ప్రధాన రోడ్డు ద్వారా కాశీనగర్ బ్లాక్ హరిపురం, గుణుపురం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వెంటనే రహదారి మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టాలని సర్పంచ్ భృషభ, పదసాహి గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు.



అధ్వానంగా మారిన రహదారి

రోడ్డు పాడైపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

యువకుడి దారుణ హత్య



ఖగేశ్వర్ మండంగి మృతదేహం



ఖగేశ్వర్ మండంగి (ఫైల్)

రాయగడ: ఒక యువకుడి గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి ఎకొరాల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు కొరాపుట్ జిల్లా పరిధి దశమంతపూర్ సమితి కలియా అంబో గ్రామానికి చెందిన ఖగేశ్వర్ మండంగి (23)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న దొరాగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఖగేశ్వర్, అతని స్నేహితుడు ఒక ఆటోలో టికిరిలో జరుగుతున్న బలిజాత్రను చూసేందుకు శుక్రవారం రాత్రి వెళ్లి, జాతర చూసి అనంతరం ఇంటికి తిరిగి వస్తున్నారు. వీరు ఎకొరాల్ గ్రామానికి సమీపంలోకి వచ్చాక స్నేహితుడు ఆటోను ఆపి తన వద్దనున్న పదునైన కత్తితో దాడిచేసి గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని పక్కనే ఉన్న పొదల్లో పడేశాడు. శనివారం గ్రామస్తులు పొదల్లో ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చేతబడి చేస్తున్నడన్న అనుమానంతో కొద్ది రోజుల క్రితం ఖగేశ్వర్‌తొ తగాదా పడ్డ అతని స్నేహితుడు, ఇదే అనుమానంతో హత్యచేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీయే రాజమార్గం



పర్లాకిమిడి: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి జగదీష్ ప్రసాద్ మహంతి తదితరులు



కొరాపుట్: బాధితులకు చెక్కులు అందజేస్తున్న న్యాయమూర్తి సుబ్రత్ మహంతి

రాయగడ: పలు కేసుల్లో రాజీయే రాజ మార్గమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 36,317 కేసులను పరిష్కరించారు. అలాగే గుణుపూర్, రాయగడ, కాసీపూర్, బిసంకటక్, పద్మపూర్, మునిగుడ కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 278 కేసులను పరిష్కరించారు. అదే విధంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 36,030 కేసులను, 9 ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి, జిల్లా న్యాయ సలహా కార్యదర్శి శుభత్ ఆచార్య, జిల్లా అదనపు జడ్జి అల్పనా స్వాయి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా సెషన్సు జడ్జి, జిల్లా న్యాయసేవ ప్రాధికరణ చైర్మన్ జగదీష్ ప్రసాద్ మహంతిలు ప్రారంభించారు. మొత్తం 3,476 కేసులకు గానూ.. 2,512 కేసులను పరిష్కరించారు. అలాగే మోహనా, ఆర్.ఉదయగిరి, కాశీనగర్‌లో లోక్ అదాలత్ చేపట్టారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి బిమల్ రవుళో, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నరోత్తమ శెఠి, మహిళా కోర్టు సివిల్ జడ్జి రస్మితా సాహు, ఎస్‌డీఎం బిష్ణుప్రియా సామంతరే, సౌదామినీ బిశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: జిల్లా కోర్టులో కేసులు విచారిస్తున్న జడ్జి


జయపురం: జయపురం, కొరాపుట్, కోట్‌పాడ్, సెమిలిగుడ, లక్ష్మీపూర్, బొరిగుమ్మ, దశమంతపూర్, లమతాపుట్ తదిర ప్రాంతాల్లోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. దీనిద్వారా జిల్లాలో 6,422 కేసులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమాల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో జిల్లా జడ్జి సుబ్రత్ మహంతి నేతృత్వంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. అలాగే వివిధ కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో భాగంగా మొత్తం 702 కేసులను పరిష్కరించారు. కార్యక్రమాల్లో న్యాయమూర్తులు సీమా త్రిపాఠి, మెనితా త్రిపాఠి, అంకితా పాణిగ్రాహి, విష్ణుప్రసాద్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి తదితరులు

వంతెనపై ఇరుక్కుపోయిన ట్రక్కు



వంతెనపై ఇరుక్కుపోయిన ట్రక్కు

జయపురం: సమితిలోని పాత్రోపుట్ – కొట్టల మధ్య కొలాబ్ నదిపై ఉన్నటువంటి ఇనుప వంతెనలో బీడీ ఆకులతో వెళ్తున్న టక్కు శుక్రవారం ఇరుక్కుపోయింది. విజయవాడ – రాంచీ 326 జాతీయ కారిడార్ మార్గంలోని వంతెనలో ట్రక్కు చిక్కుకుపోవడంతో వంతెనకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మల్కన్‌గిరి జిల్లా నుంచి జయపురం, కొరాపుట్‌ల మీదుగా రాజధాని భువనేశ్వర్, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వెళ్తున్న వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ ఇనుప వంతెన రెండు వాహనాలు వెళ్లేంత వెడల్పు ఉండకపోవడంతో అధిక లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు ఇరుక్కుపోయింది. వాస్తవానికి ఇటువంటి సమస్యలు తరచూ తలెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంతెన సైతం శిథిలావస్థకు చేరుకుందని పేర్కొంటున్నారు. అందువలన మరో వంతెన నిర్మించాలని ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎరువుల గోదాములు పరిశీలన



కత్తలకవిటి వద్ద ఎరువుల గోదాము రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడిందని, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని నవ నిర్మాణ్ కృషక్ సంఘటన్, వ్యవసాయదారులు ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ మధుమిత గుసాని సమితిలోని మార్క్‌ఫెడ్ గోదాములు, సొసైటీలను శనివారం సందర్శించి ఎరువుల స్టాకును పరిశీలించారు. తొలుత గుసాని సమితిలో ఉప్పలాడ ప్రాథమిక వ్యవసాయ సహకార కమిటీ కేంద్రం(ప్యాక్), కత్తల కవిటిలో ఎరువులు స్టాక్ రిజిస్టర్లు చెక్ చేశారు. అనంతరం గుసాని సమితిలో ఎరువుల గోదామును పరీక్షించారు. జిల్లాలో ఎరువులను రైతులకు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. ఆమెతో ఆపటు డీఆర్‌సీఎస్ రిజిస్ట్రార్ హరిహర శెఠి తదితరులు ఉన్నారు.



ఉప్పలాడలో యూరియా స్టాకు పరిశీలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పూర్తి అవగాహనతో వైద్యం అందించాలి



వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ గౌతమ్

అరసవల్లి: గ్రామీణ ప్రాంతాల్లో కచ్చితంగా పూర్తి అవగాహనతోనే వైద్యం అందించాలని గ్లోబల్ న్యూరో కేర్ అధినేత డాక్టర్ దేవరెడ్డి గౌతమ్ సూచించారు. వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో మితిమీరిన వైద్యం, మందుల వినియోగాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి వారికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిష్టు అనిల్, బండి గౌతమ్, గీతాప్రియదర్శిని, మార్కెటింగ్ హెడ్ సీహెచ్ స్వామి, రెడ్‌క్రాస్ మేనేజర్ రమణ పాల్గొన్నారు.

నేడు ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు జిల్లా కార్యవర్గం ఆదివారం ఆత్మీయ సత్కారం చేయనుందని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంత్ సాయిరాం, చల్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా జెడ్పీ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఉద్యోగవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో 5 కేజీల గంజాయితో ముగ్గురు పట్టుబడ్డారని డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయం వద్ద శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకి చెందిన ముత్తుకుమార్, ఉదయ్‌కుమార్, ముత్తురామలింగంలు 5 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. తమిళనాడు రాష్ట్రం తిరుప్పూరుకు చెందిన గంజాయి వ్యాపారి పాండ్యరాజు సూచన మేరకు ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకొన్నారు. అనంతరం రైలులో తమిళనాడు వెళ్లేందుకు బయలుదేరగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి తరలించారు. వీరి వద్ద నుంచి గంజాయి, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలో గంజాయిని విక్రయించిన కుమార్, గంజాయిని తీసుకురావాలని సూచించిన పాండ్యరాజ్‌పైనా కేసులు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై ముకుందరావు, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

రణస్థలం: లావేరు మండలం బొంతుపేట శ్మశానవాటిక వెనుక ఉన్న పొలంలో సుమారు 65 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహం పక్కనే చేతి కర్ర ఉందని, వివరాలు తెలిసిన వారు 63099 90851 నంబరుకు తెలియజేయాలని లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు కోరారు.

మద్యానికి బదులు గడ్డి మందు తాగి..


ప్రభాకరరావు (ఫైల్)

బూర్జ: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన బూర్జ మండలం తోటవాడ పంచాయతీ టి.ఆర్.రాజుపేటకు చెందిన కొంగరాపు ప్రభాకరరావు (45) శనివారం మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకరరావు మద్యానికి బానిసయ్యాడు. గురువారం వేకువజామున బాటిల్ తేడా గమనించక గడ్డి మందు తాగాడు. శుక్రవారం ఉదయం వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు గమనించి 108 అంబులెన్సులో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే ప్రభాకరరావుకు భార్య కేసరమ్మ, కూమారుడు దుర్గాప్రసాద్, వివాహమైన కుమార్తె ఉన్నారు. కేసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు


మా సమలేశ్వరికి హారతినిస్తున్న గవర్నర్ కంభంపాటి హరిబాబు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: యువత పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు అధిరోహించవచ్చని గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. పశ్చిమ ఒడిశా ప్రధాన కేంద్రం సంబల్‌పూర్ జిల్లా కేంద్రంలో శనివారం ఆయన పర్యటించారు. జిల్లాలో బుర్లాలోని వీరేంద్ర సాయి టెక్నికల్ యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, డీఎస్సీ, డిలిట్, పీహెచ్‌డీ ఇతర డిగ్రీలు అందజేశారు. అంతకుముందు పశ్చిమ ఒడిశా ఆరాధ్య దేవత మా సమలేశ్వరి శక్తి పీఠం సందర్శించారు. ఆయనతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూరజ్ సూర్యవంశీ, సంపత్ చంద్ర స్వయ్, ఎమ్మెల్యేలు రబినాయక్, జయనారాయణ మిశ్ర తదితరులు ఉన్నారు.

నువాపడా ఉప ఎన్నికకు కసరత్తు

భువనేశ్వర్: ఇటీవల బిజూ జనతా దళ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ధొలొకియా మరణం తర్వాత నువాపాడలో ఉప ఎన్నిక అనివార్యమైంది. అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ప్రతిపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) మరియు కాంగ్రెస్ త్రిముఖ పోటీకి సిద్ధమవుతున్నాయి. గత 2024 శాసన సభ ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలిచిన ఘసిరామ్ మాఝీపై కాంగ్రెస్ నమ్మకంగా ఉంది. అధికార పక్షంగా ఈ ఉప ఎన్నికలో విజయం భారతీయ జనతా పార్టీకి ప్రతిష్టాత్మక సవాలుగా నిలవనుంది. సానుభూతి ప్రాతిపదికన ఈ స్థానం మరోసారి కైవసం చేసుకోవాలనే దృక్పథంతో విపక్ష బిజూ జనతా దళ్ తనదైన శైలిలో పావులు కదుపుతోంది. దీంతో ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నువాపడా నియోజక వర్గం ఓటర్ల జాబితా ప్రత్యేక సారాంశ సవరణ (ఎస్ఎస్ఆర్)కు ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈనెల 14 నాటికి పోలింగ్‌స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ మరియు సవరణ, ఈ నెల 15న ముసాయిదా సమగ్ర ఓటర్ల జాబితా ప్రచురణ, ఈనెల 29వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలుకు గడువు మంజూరు చేశారు. గడువులోగా దాఖలైన అభ్యంతరాలు పరిశీలించి అక్టోబర్ 7 నాటికి పరిష్కరిస్తారు. అనంతరం తుది రోల్ ప్రచురణ, అక్టోబర్ 9న తుది ఆమోదిత జాబితాలని వెల్లడిస్తారు.

టీ షాపులో అగ్ని ప్రమాదం


కాలిపోయిన దుకాణంలోని సామగ్రి

పర్లాకిమిడి: స్థానిక గాంధీ జంక్షన్ వద్ద ఒక టీ షాపులో అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.5 లక్షల విలువ కలిగిన సామగ్రి కాలి బూడిదయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం సాయంత్రం గాంధీ జంక్షన్ వద్ద సాహు టీ దుకాణంలో కొత్త రిఫ్రిజరేటర్‌కు కనెక్షన్ ఇచ్చాడు. అయితే శనివారం వేకువజామున దుకాణం నుంచి మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. కానీ అప్పటికే షాపులో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

షాలిని పండిట్ బదిలీ

భువనేశ్వర్: ఒడిశా క్యాడర్ 2001 సంవత్సరపు ఐఏఎస్ అధికారి షాలిని పండిట్ కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక సేవల శాఖ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల శాఖ పరిధిలోని క్యాబినెట్ నియామక కమిటీ దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది.

ఆమె 5 ఏళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వులు పేర్కొన్నాయి. బాధ్యతలు స్వీకరించిన నుంచి పదవీ కాలం పరిగణిస్తారు. షాలిని పండిట్ ప్రస్తుతం ఒడిశా ప్రభుత్వ పాఠశాలలు మరియు సామూహిక విద్య విభాగం కమిషనర్ కమ్ సెక్రటరీగా పని చేస్తున్నారు.

దసరా ఉత్సవాలకు సన్నాహాలు


సమావేశంలో పాల్గొన్న దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

జయపురం: పట్టణంలో చారిత్రాత్మక దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దసరా ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ సభాగృహంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భాగంగా ఆదివారం శుభరాట వేసేందుకు నిర్ణయించారు. అనంతరం ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలను చేపట్టనున్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డి, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ కాశ్యప్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్వహించం


నబరంగ్‌పూర్ బండారు ఘరణి దేవాలయం వద్ద అర్చకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కొరాపుట్: ఇకపై తాము బాల్య వివాహాలను ప్రోత్సహించమని వివిధ దేవాలయాల అర్చకులు పేర్కొన్నారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల వద్ద స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. దేవాలయాల్లో బాల్య వివాహాలను అనుమతిమంచమని, అలాగే బాల్య వివాహాలను ప్రోత్సహింహించమని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరైనా తమను సంప్రదిస్తే అధికారులకు సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని బండారు ఘరణి, జగన్నాథ, పాత శివాలయం, హనుమాన్, సత్యానారాయణ స్వామి దేవాలయాల వద్ద ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో శోభ సంస్థకి చెందిన ఉమా సత్నమి,తపస్ రంజన్ డంగ్రి, భువనేశ్వర్ దిశారి తదితరులు పాల్గొన్నారు.

• పాఠశాలల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి స్మృతి స్నిగ్ధామిశ్రా

పర్లాకిమిడి: గజపతి జిల్లా నోడల్ అధికారి, ఒడిశా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ స్మృతి స్నిగ్ధామిశ్రా జిల్లాలో గుసాని, రాయఘడ, ఆర్.ఉదయగిరి బ్లాకుల్లోని పలు ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న 5టీ పథకం అమలు తీరు పరిశీలించారు. నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్.ఉదయిగిరి ఉన్నత పాఠశాల, మహేంద్రగడ, కెరండీ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలపై తనిఖీ చేశారు. జిల్లాలోని ఉన్నత విద్యాలయాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5టీ పథకం ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ అంపోలు రవిబాబు తదితరులు ఉన్నారు.

పెచ్చులూడిన పోస్టాఫీసు పైకప్పు


కుర్చీలపై ఊడిపడిన శ్లాబ్‌ముక్కలు


బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని పోస్టాఫీసు పైకప్పు పెచ్చులూడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఖాతాదారులు పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. తొలుత చిన్న చిన్న ముక్కలు పైకప్పు నుంచి రాలుతుండడం గమనించి భయపడి బయటకు వెళ్లిపోవడంతో ముప్పు తప్పింది. ఓ ఖాతాదారుని భుజంపై పెచ్చు పడడంతో స్వల్పంగా గాయమైంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది సైతం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ కార్యకలాపాల్లో ఏఐ టెక్నాలజీ

• వినియోగానికి ప్రభుత్వం యోచన

భువనేశ్వర్: ప్రభుత్వ కార్యకలాపాల్లో అధికారులు మరియు సిబ్బందిలో నైపుణ్యత, సామర్థ్యం పెంపొందించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) అనుసంధానపరచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అనుబంధ సాధనాల సేకరణకు అన్ని ప్రభుత్వ విభాగాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ అధికారిక పరిపాలనా సంస్కరణల కోసం పాలనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుంది. మెరుగైన ప్రజా సేవల పంపిణీ కోసం పాలనను ఆధునీకరించడానికి మరియు సాంకేతికతను ఉపయోగించుకోవడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాల్లో ఈ చొరవ ఒక కీలకమైన చర్యగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం అదనపు ప్రముఖ కార్యదర్శి సురేంద్ర కుమార్ పేర్కొన్నారు. తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం ప్రభుత్వ విభాగాలు రోజువారీ కార్యకలాపాలలో ఏఐ సాధనాలను ఏకీకృతం చేసేందుకు ప్రోత్సహిస్తోంది. వర్క్ ఫ్లో క్రమబద్ధీకరణ, డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఏఐ అనుసంధానం వాస్తవ కార్యాచరణలో విభాగాలకు అధికారాలు కల్పించింది. కృత్రిమ మేధస్సు వ్యవస్థ ప్రభుత్వ గోప్యత నిబంధనల పరిధిలో పని చేయాల్సి ఉంటుందని ఆదేశాలు స్పష్టం చేశాయి. ప్రభుత్వ అంతర్గత వ్యవహారాలకు సంబంధించిన గోప్యమైన లేదా రహస్య సమాచారం సంబంధిత పత్రాలను ఏఐ ప్లాట్‌ఫామ్‌ల్లో అప్‌లోడ్ చేయకూడదు. ప్రభుత్వ డేటా భద్రతకు సంబంధించి కఠినంగా వ్యవహరించడం అనివార్యంగా పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా స్టేట్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎస్‌యూజే) సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. జిల్లా కేంద్రంలోని స్కిల్ డవలప్‌మెంట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సర్వ సభ్య సమావేశం జరిగింది. దీనిలో జిల్లా అధ్యక్షుడిగా తరుణ్ కుమార్ మహాపాత్రో (రుణా), ఉపాధ్యక్షుడిగా రమేష్ సాహు, కార్యదర్శిగా శిశిర్ ఆచార్య, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్ కుమార్ బిసోయిలు ఎన్నికయ్యారు. ఇటీవల నారాయణపట్న ధరిత్రి విలేకరి రాజ్ కిషోర్ జెన్నా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడం జరిగింది. దీంతో అతనికి ఆర్థిక సాయం అందజేయాలని సమావేశం నిర్ణయించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కీర్తిచంద్ర సాహు, జిల్లా మాజీ అధ్యక్షుడు బిజయ చౌదరి, సీహెచ్ శాంతాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: అవిభజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంక్) ఆన్‌లైన్ సేవలను శనివారం ప్రారంభించారు. నాగపూర్‌లో శనివారం జరిగిన రైల్వే అర్బన్ బ్యాంకు 96వ వార్షికోత్సవంలో భాగంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్ సదుపాయంతో ఖాతాదారులు ఉన్న చోట నుంచి హాలిడే హోం బుకింగ్, రుణ దరఖాస్తు దాఖలు, పొదుపు ఖాతా తాజా వివరాలు, కేవైసీ నమోదు తదితర అర్బన్ బ్యాంకు సంబంధిత సేవలను పొందగలుగుతారని ఖుర్దారోడ్ మండలం ప్రతినిధి లక్ష్మీధర మహంతి తెలిపారు. కార్యక్రమానికి నాగపూర్ మండల రైల్వే అధికారి (డీఆర్ఎం) దీపక్ కుమార్ గుప్తా, తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు తదితరులు హాజరయ్యారు.

హిందీ భాషాభివృద్ధిపై..
నిలువెల్లా నిర్లక్ష్యం


హిందీ దివాస్ సందర్భంగా 'అ' అక్షరంతో విద్యార్థుల సమూహం(ఫైల్)

• టీచర్ల భర్తీ, ఇతర అంశాలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
• రాజభాషకు ప్రోత్సాహం కరువు
• నేడు జాతీయ హిందీ దివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: జాతీయ భాష హిందీపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. హిందీ భాషాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడంలేదు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీతోపాటు లాంగ్వేజ్ టీచర్లను సైతం నియమించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ సీపీ పాలనలో హిందీ భాషాభివృద్ధికి పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. హిందీ సబ్జెక్ట్ టీచర్లు పాఠశాలల్లో ఉండేలా జాగ్రత్తలు చేపట్టారు. గత డీఎస్సీలో హిందీ పోస్టులను సైతం భారీగా భర్తీ చేశారు. ప్రస్తుతం హిందీ భాష పట్ల, హిందీ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని పలువురు భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రాజ భాషగా హిందీని ప్రోత్సహించాలని హిందీమంచ్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి పక్షోత్సవాలు..

ఈ నెల 14న జాతీయ హిందీ దివాస్ సందర్భంగా.. ఆదివారం నుంచి పక్షోత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమౌతున్నారు. ఆదివారం నుంచి 28వ తేదీ వరకు 15 రోజులపాటు ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో, ప్రతి జిల్లాలో ఐదు రోజులు పాటు హిందీ దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మంచ్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కోనే శ్రీధర్ నేతృత్వంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. హిందీ ఫోరం, హిందీ వికాస వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులను హిందీపై ఆసక్తిపెంచేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేలా కసరత్తులు చేశారు. మరోపక్క హిందీ సులేఖన్ పోటీలను పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు.

డిమాండ్లు ఇవే..

- హైస్కూళ్లలో హిందీ పండింట్ల సంఖ్యను పెంచాలి.
- ప్రైవేటు స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచే బోధన మొదలవుతుది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ప్రాథమికస్థాయి నుంచే కనీసం రెండో తరగతి నుంచే హిందీ బోధన అమలు చేయాలి.
- ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ ప్లస్(జూనియర్ కాలేజీల) స్థాయి వరకు అన్ని పాఠశాలల్లో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ పండిట్ పోస్టులను భర్తీ చేయాలి.
- మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, హైస్కూల్ ప్లస్, జూనియర్ కాలేజీల్లో పీజీటీ హిందీ/లెక్చరర్ పోస్టులను మంజూరు చేయాలి.
- హిందీ పండిత శిక్షణా కళాశాలలను తక్షణమే ప్రారంభించాలి. వేలాది మంది హిందీ పట్టభద్రులు రాష్ట్రంలో హిందీ పండిట్ ట్రైనింగ్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.
- ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో హిందీ ద్వితీయ భాషగా హిందీ అధ్యయనాన్ని ప్రోత్సహించాలి.
- రాబోయే డీఎస్సీలో హిందీ పండిట్ పోస్టుల సంఖ్యను పెంచాలి.
- 6 నుంచి 10వ తరగతి వరకు హిందీ పాఠ్యపుస్తకాలను సరళంగా మార్చాలి. త్రిభాషా సూత్రాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలి.
- 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఎల్పీసెట్(భాషా హిందీ ప్రవేశపరీక్ష) ద్వారా హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి.

ప్రాథమికస్థాయి నుంచే హిందీబోధన జరగాలి..



ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ నుంచే హిందీ బోధన సాగుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో అలా జరగడం లేదు. కనీసం 2, 3వ తరగతుల నుంచైనా హిందీ బోధన మొదలుకావాలి. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు, హిందీ భాషాపండితులను నియమించాలి. డీఎస్సీ ద్వారా హిందీ పండిట్‌పోస్టులను పెద్దఎత్తున భర్తీ చేయాలి.

– కోనే శ్రీధర్, ఉత్తరాంధ్ర సమన్వయకర్త, హిందీ మంచ్

తగిన గుర్తింపు లేదు..



హిందీ భాషాభివృద్ధికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరింతగా ప్రోత్సహించాలి. జాతీయ భాషగా హిందీకి తగిన గుర్తింపు ఇప్పటికీ లభించలేదనే చెప్పాలి. హిందీ భాషాభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటు అందించకపోతే మా గోడు ఎవరికి చెప్పుకోవాలి. వేలాది మంది హిందీ పట్టభద్రులు పండిట్ ట్రైనింగ్ కోసం నిరీక్షిస్తున్నారు.

– కనుగుల సత్యం, జిల్లా అధ్యక్షుడు, హిందీ మంచ్

జాతీయ సమైక్యత కోసం..



హిందీ మన దేశ జాతీయ భాష. జాతీయ సమైక్యతను ఇనుమడింపజేసే భాష హిందీయే. రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలో హిందీకి 17 సెక్షన్ల తర్వాతే రెండో పోస్టును భర్తీ చేస్తుండటం తగదు. ఇది తీరని అన్యాయం. హిందీ లెక్చరర్లను నియమించాలి. పదోన్నతులతో భర్తీచేయాలి.

– ఇమ్మిడిశెట్టి సంతోష్‌కుమార్, హిందీ ఫోరం జిల్లా కన్వీనర్

క్లుప్తంగా

గుడి దొంగల అరెస్టు



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ దుర్గాప్రసాద్

పూసపాటిరేగ : మండలంలోని కనిమెల్ల గ్రామంలో దొంగతనం చేసిన నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఐ.దుర్గాప్రసాదు శనివారం తెలిపారు. పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిమెల్ల గ్రామంలోని గుడిలో ఇద్దరు నిందితులు దొంగతనం చేసినట్టు తేలడంతో సొత్తు రికవరీ చేసినట్టు తెలిపారు. పేరాపురం, కోనాడ గ్రామాలలో ఇదే వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.8.50 లక్షల జరిమానా

విజయనగరం క్రైమ్ : మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 85 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 85 కేసులు నమోదు చేశారు. అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 85 మందికి రూ.8.50 లక్షలను జరిమానాగా విధించారని ఎస్పీ తెలిపారు.

15 నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మి శనివారం తెలిపారు. 15న రాజీవ్ స్టేడియంలో బాక్సింగ్ పోటీలు, కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెజ్లింగ్ క్రీడాంశంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 16న విజయనగరం విజ్జీ స్టేడియంలో తైక్వాండో, స్కేటింగ్, సైక్లింగ్ పోటీలు, మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రగ్బీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 17న విజయనగరంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ క్రీడాంశంలో, బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్చరీ క్రీడాంశంలో ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్ - 14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా రోగి పట్ల రేడియో గ్రాఫర్ అసభ్య ప్రవర్తన!

- సర్వజన ఆసుపత్రిలో ఘటన
- ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

విజయనగరం ఫోర్ట్: ఎక్సరే కోసం వెళ్లిన ఓ మహిళ పట్ల సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న ఓ రేడియోగ్రాఫర్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గజపతినగరం మండలానికి చెందిన ఓ మహిళ ఫైల్స్ వ్యాధితో సర్వజన ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని ఆసుపత్రిలో ఇన్‌పేషంట్‌గా చేర్చారు. శనివారం ఎక్సరే తీయించాలని వైద్యులు చీటి రాసి ఇవ్వడంతో అది పట్టుకుని మహిళ ఎక్సరే విభాగానికి వెళ్లింది. ఎక్సరే గదిలోకి వెళ్లిన మహిళ పట్ల ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ రేడియోగ్రాఫర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చేసింది. గది బయట ఉన్న తన భర్తకు విషయం చెప్పడంతో సదరు ఉద్యోగిపై ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఉద్యోగికి ఆసుపత్రి అధికారులు మెమో జారీ చేసినట్టు తెలిసింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ వద్ద సాక్షి ప్రస్తావించగా తమ దృష్టికి ఈ విషయం వచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పోదలి గ్రామానికి చెందిన పొన్నాడ తవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అదే గ్రామానికి చెందిన ఎస్.చిన్నవాడు వద్ద గతంలో పొన్నాడ తవుడు పని చేయడంతో తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడగగా తనపై శుక్రవారం కర్రతో దాడి చేశాడని శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భగవద్గీత పఠన పోటీలు

విజయనగరం: స్థానిక రోటరీ సెంట్రల్ క్లబ్ నవతరోత్సవాల్లో భాగంగా నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు శనివారం నిర్వహించారు. మూడు విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు మొత్తం 160 మంది విద్యార్థులు హాజరై శ్లోకాల పఠనంలో తమ ప్రతిభ కనబరిచారు. అనంతరం నిర్వాహకులు పోటీల విజేతలను ఖరారు చేశారు. కార్యక్రమంలో టి.ఎల్.ఎస్.మూర్తి, ఎం.శ్రీనివాస్, విజయ్‌కుమార్ అగర్వాల్, ఉదయ్, రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజభాష హిందీ



- నేడు జాతీయ భాష హిందీ దినోత్సవం
- ప్రతీ ఏడాది సెప్టెంబర్ 14న నిర్వహణ
- వారం రోజుల పాటు పక్షోత్సవాలు
- ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే హిందీ
- రోజురోజుకు హిందీ కోర్సుకు పెరుగుతున్న ఆదరణ

రాజాం : హిందీ భాష దేశ భాషే కాకుండా రాజసం ఉట్టిపడే రాజభాష. దేశ ప్రజలందరినీ ఒకే తాటి మీదకు తీసుకొచ్చేందుకు ప్రధాన వారధి హిందీ భాష. దాదాపు 3,372 పైగా భాషలుండగా, 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ.. జాతీయ భాషగా హిందీనే మన దేశం గుర్తించింది. ఈ దేశంలో హిందీ భాషను మాట్లాడేవారు, అర్థం చేసుకునే వారు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని 343వ అధికరణం ప్రకారం దేవనాగరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. నాటి నుంచి ఏటా సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ జాతీయ భాషా దినోత్సవాన్ని హిందీ దివాస్‌గా పిలుస్తారు.

ఒకటే దేశం.. ఒకటే భాష

మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో హిందీ మాతృభాషగా ఉంది. అలా అని అక్కడ హిందీ ఒక్కటే లేదు. దాంతో పాటు మరికొన్ని ఇతర భాషలు కూడా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, బెంగాల్, కశ్మీర్ రాష్ట్రాల వాళ్లకు ప్రాంతీయ మాతృభాషలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినపుడు భాషా సమస్య ఉత్పన్నమైంది. ఈ భాషా సమస్యను అధిగమించేందుకు జాతీయ భాషను గుర్తించాల్సి వచ్చింది. అంతేకాకుండా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక.. ప్రభుత్వ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో నిర్వహించడానికి ఏ భాషను వాడాలి? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనిపై మన దేశ జాతీయ నాయకుల మధ్య జరిగిన చర్చల ఫలితంగా 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికార భాషగా నిర్ణయించారు. నాటి నుంచి ఆ రోజున జాతీయ హిందీ భాషా దినోత్సవం ప్రతీ ఏడాది జరుపుకుంటున్నాం.

నాగరికత పుట్టుక నుంచి

- హిందీ.. అనే పదం పర్షియన్ భాషలోని హింద్ నుంచి వచ్చింది. హింద్ అంటే సింధు నది ప్రవహించే నేల అని అర్థం.
- 11వ శతాబ్ద కాలంలో టర్కీ పాలకులు మన దేశంపై దండయాత్రకు వచ్చినప్పుడు హింద్ అనే పదాన్ని ఉపయోగించినట్టు చరిత్ర పరిశోధకులు చెబుతుంటారు. హిందీ భాష సంస్కృతం నుంచి పుట్టగా... దీన్ని దేవనాగరిక లిపిలో రాయడం జరుగుతోంది.
- దేవనాగరి లిపిలో రాసే హిందీ భాషలో చాలా మాండలికాలు కనిపిస్తాయి. వీటిలో బ్రజ్, ఖరీ, బోలీ, బుందేలీ, అవధి, బాఘేలి వంటి మాండలికాలు ప్రముఖమైనవి. ప్రపంచ వ్యాప్తంగా 180కి పైగా విశ్వ విద్యాలయాల్లో హిందీ భాషకు సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయి.

వారోత్సవాలు.. పక్షోత్సవాలు...

హిందీ దివాస్ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 14న హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తారు. హిందీ ప్రచారక్‌లు ఉన్న కేంద్రాల్లో వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించి ర్యాలీలు చేయడంతో పాటు ప్రజలకు హిందీ భాషపై అవగాహన కల్పిస్తుంటారు. హిందీ భాష అభివృద్ధికి కృషి చేసిన హిందీ భాష సాహితీవేత్తలు, కవులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తారు.

మెండుగా అవకాశాలు

హిందీ భాషను నేర్చుకున్న వారికి, అందులో డిగ్రీ పట్టాలు పొందిన వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు హిందీ భాషలో ప్రావీణ్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు పొందే వారిలో ఎక్కువ మంది హిందీ భాషపై పట్టు ఉన్నవారే కనిపిస్తున్నారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ్, విద్వాన్ వంటి కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సివిల్ సర్వీసులతో పాటు డిగ్రీ తత్సమాన పోటీ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలకు అర్హులుగా గుర్తింపు పొందుతున్నారు.

సులభమైన భాష



హిందీ భాష చాలా సులభతరమైన భాష. నిరుద్యోగులు చాలా మందికి ఉపాధి కల్పిస్తుంది. పది, ఇంటర్ తరువాత హిందీ సబ్జెక్టుగా తీసుకుని డిగ్రీ చేయడం, తర్వాత హిందీ పండిట్ శిక్షణ పొందడం, గ్రూప్ - 1, 2 వంటి ఉద్యోగులు సంపాదించడం చాలా తేలిక.

కె.మధుసూధనరావు, హిందీ ప్రచారక్, రాజాం

బాగా కష్టపడితే



హిందీ భాషలో చదువుకుని బాగా కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. పదో తరగతి తరువాత ఇంటి వద్దే ఉండి ఉన్నత చదువులు చదువుకోవాలంటే హిందీ ప్రచార సభలు చాలా ఉపయోగపడుతున్నాయి.

బి.ఎల్.నాయుడు,
హిందీ భాషోపాధ్యాయులు, రాజాం

నాగావళి నదిలో దూకిన మహిళ

- ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం సమీపంలో నాగావళి నదిపై గల వంతెనపై నుంచి శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ దూకి ఆత్మహత్యాయత్నం చేసినట్టు అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నదీ తీరం పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా పరిధిలో గల రేగిడి ఆమదాలవలసకు అనుసంధానంగా ఉంది. ఈ క్రమంలో రెండు జిల్లాలకు చెందిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం సమయంలో దాదాపు 30 ఏళ్ల మహిళ వంతెన పైనుంచి ఆత్మహత్యకు పాల్పడే క్రమంలో నదిలో దూకింది. అక్కడకు సమీపంలో ఉన్న కొందరితో పాటు పాలకొండ వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కూడా ఈ ఘటనను గుర్తించారు. ఇటీవల కురుస్తున్న వర్ష ప్రభావంతో నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండటంతో క్షణాల వ్యవధిలో ఆ మహిళ నదీ ప్రవాహంలో కొట్టుకుంటూ పోయినట్టు చూసిన వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండు జిల్లాల పోలీసులు, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వెతుకులాట చేపట్టారు. ఫలితం లేకపోటం, చీకటి పడటంతో అంతా వెనుగిరిగారు. నదిలో దూకిన మహిళ వివరాలు తెలియరాలేదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని, వంతెన వద్ద చెప్పులు మాత్రమే ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: రాజీయే రాజ మార్గమని కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎం.బబిత అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ వలన కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు వృథా కాకూడదన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్ కేసులు, రాజీ పడదగిన కేసులను రాజీ మార్గంలో ఇరు పార్టీల సమ్మతితో శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్ ఉమ్మడి జిల్లాలైన విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల్లోని విజయనగరం పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో మొత్తంగా 6852 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. వాటిలో సివిల్ కేసులు 280, క్రిమినల్ కేసులు 6505, ప్రీ లిటిగేషన్ కేసులు 67 పరిష్కరించినట్టు తెలిపారు. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 37 లక్షల 50 వేల రూపాయలు మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మొదటి శ్రేణి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనాదేవి, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి కె.వి జయ కళ్యాణి, బి.అప్పలస్వామి, నాలుగవ శ్రేణి న్యాయమూర్తి, ఎస్.పద్మావతి, మహిళా మరియు ఐదవ జిల్లా న్యాయమూర్తి కె.నాగమణి, ఫోక్స్ న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయమూర్తి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కోర్ట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పోలీస్, ఇన్సూరెన్సు అధికారులు, బ్యాంకు మేనేజర్లు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, ఎక్కువ సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

కోర్టుల వారీగా పరిష్కారమైన కేసులు

కోర్టు	పరిష్కారమైన కేసులు
విజయనగరం	2224
పార్వతీపురం	486
బొబ్బిలి	1451
సాలూరు	975
శృంగవరపుకోట	337
గజపతినగరం	577
చీపురుపల్లి	543
కొత్తవలస	156
కురుపాం	103
మొత్తం	6852

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటోస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వాహనమిత్ర పథకాన్ని ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు వాహనాల డ్రైవర్లందరికీ వర్తింపజేయడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. స్థానిక బుచ్చెన్న కోనేరు జంక్షన్ వద్ద ఉన్న ఆటోస్టాండ్ దగ్గర ఆటోడ్రైవర్లతో కలిసి శనివారం నిరసనకు దిగిన ఆయన..ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఇవ్వడం వల్ల ఆటో, మ్యాక్సీ, జీపు, వ్యాన్ డ్రైవర్లకు ఎంతో నష్టమని, జీవనోపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన వాహన మిత్ర పథకం అన్ని వాహనాల డ్రైవర్లకు వర్తించేలా చూడాలన్నారు.

ప్రతి డ్రైవర్‌కు పెన్షన్, పీఎఫ్‌తో పాటు రూ.5 వేల పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అప్పరుబోతు జగన్నాథం, పొందూరు అప్పలరాజు, బూర వాసు, వద్దాది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పది లారీలు సీజ్



పట్టుబడిన లారీలతో విజిలెన్స్ సీఐ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు

కొత్తవలస : పరిమితికి మించి అధిక బరువులను రవాణా చేస్తున్న పది లారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. అరుకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో రోడ్డు రవాణ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తగా దాడులు నిర్వహించారు.అధిక బరువుతో రవాణా చేస్తున్న పది లారీలను గుర్తించి సీజ్ చేసి రూ 6.80 లక్షలు జరిమానా విధించారు. సీజ్ చేసిన లారీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌కుర్, ఐశ్వర్యలక్ష్మి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని జగన్నాధపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత తనను రాజాం పట్టణానికి చెందిన కొలు సురేష్ వేధిస్తున్నాడని శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివాహిత తన భర్త, కుటుంబంతో కలసి రాజాం టౌన్‌లో నివాసముండేవారు. ఇంటి ఎదురుగా ఉన్న కొలు సురేష్ నిత్యం వేధిస్తుండడంతో తన భర్త తనను అనుమానించేవాడని, దీంతో సంవత్సర క్రితం తన కన్నవారి ఇంటికి వచ్చి ఉండిపోయింది. సెప్టెంబర్ 4వ తేదీన సురేష్ జగన్నాధపేట వచ్చి ఎవరు లేని సమయంలో చేయి పట్టుకుని లాగడంతో పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టి మాట్లాడినా ఎటువంటి ఫలితం లేకపోవడంతో శనివారం ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్ : నగరంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో ఓ మహిళ శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు... కొత్తవలసకు చెందిన భారతి గుజరాత్‌కు చెందిన షిండేను వివాహం చేసుకుంది. షిండే మోసగాడని తెలిసి విబేధించి అతనకు దూరంగా ఉంటుంది. ఈ విషయం కొత్తవలస పోలీసులకు తెలిసి ఆమెను విజయనగరంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉన్న హోమ్‌కు తరలించారు. ఇక్కడ చేరిన తరువాత భారతి శనివారం బాత్రూమ్‌కని వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. హోం సిబ్బంది అనుమానంతో తలుపు పగలగొట్టి చూడగా బాత్రూమ్‌లోని కిటికీకి చున్నీతో కట్టి ఆత్మహత్య చేసుకుంది. హోం ఉద్యోగి భవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురికి నక్క కాటు

- చివరకు నక్కను చంపేసిన బాధితుడు



నక్క తన కాలును కరుస్తూ ఉండిపోవడంతో నిస్సహాయ స్థితిలో నక్కపై కూర్చుని ఉండిపోయిన చిన్నోడు

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన ఎమ్.లక్ష్మి, కె.సూరయ్య, వి.లచ్చమ్మ, బూరాడపేట గ్రామానికి చెందిన బంటుపల్లి చిన్నోడు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన కె.జగన్‌మోహన్‌లకు నక్క కాటేసింది. వీరు సంతకవిటి పీహెచ్‌సీకి రావడంతో వేక్సినేషన్ వేసినట్టు వైద్యాధికారి యు.నాగేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. కె.జగన్‌మోహన్ రాజాం స్కూటీపై వెళ్తుండగా సంతకవిటి సమీపంలో నక్క దాడి చేసి కాటు వేసింది. అక్కరాపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు సంతకవిటి నుంచి అక్కరాపల్లి వెళ్తుండగా సంతకవిటి సమీపంలోనే అకస్మాత్తుగా దాడి చేసి గాయపరిచింది.

నక్కతో పోరాటం

బూరాడపేట గ్రామానికి చెందిన బంటుపల్లి చిన్నోడుకు సంతకవిటిలోని భాను ఫిల్లింగ్ స్టేషన్ వద్ద అకస్మాత్తుగా నక్క దాడి చేసి దాదాపు 30 నిమిషాలు కాలును పట్టేయడంతో నక్కపై కూర్చొని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. స్థానికులు కూడా చూసి భయపడి కాసేపట్లో తేరుకుని నక్కను చంపడంతో చిన్నోడుకు పెను ప్రమాదం తప్పింది. అనంతరం చిన్నోడు పీహెచ్‌సీకి వెళ్లి వేక్సినేషన్ వేసుకున్నారు.

17న ఆటోల బంద్

- ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ



మెయిన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు, సంఘ నాయకులు

చీపురుపల్లి: ఆటో డ్రైవర్ల కడుపు కొట్టే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా, రాష్ట్ర యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 17న నిర్వహించనున్న ఆటోల జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి నారాయణరావు కోరారు. శనివారం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం చేయడంతో ఆటో డ్రైవర్లపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈ నెల 17న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 17న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు వరకు పకడ్బందీగా బంద్ నిర్వహించాలన్నారు. ఈ బంద్‌కు సీఐటీయూ మద్దతు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నీలాపు అప్పలరాజు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు, చీపురుపల్లి సంఘ నాయకులు పండూరి తాతాజీ, మాడుగుల రమణ, జగదీష్, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఫార్మసీ కళాశాల ప్రారంభం

- ఆన్‌లైన్‌లో సర్టిఫికేషన్ కోర్సులు
- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ



మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రాంగణంలో ఫార్మసీ కళాశాలను ప్రారంభించేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) అనుమతులు మంజూరు చేసిందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ శనివారం తెలిపారు. ఈ ఫార్మసీ కళాశాల అక్టోబర్ నెల నుంచి ప్రారంభం కానుందని ఆమె వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఈ సంవత్సరం నుంచి పలు సర్టిఫికేషన్ కోర్సులు, ఫార్మసీ కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కోర్సుల ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉంటాయి. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో పలు సర్టిఫికేషన్ కోర్సులు అందిస్తామని తెలిపారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ (3 నెలల కాల వ్యవధి), ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మరియు టూల్స్ (ఒక నెల కాల వ్యవధి), మెషిన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ (ఒక నెల కాల వ్యవధి), సైబర్ సెక్యూరిటీ (ఒక నెల కాల వ్యవధి), క్వాంటం కంప్యూటింగ్ (ఒక కాల వ్యవధి) కోర్సులు ఉన్నాయని ప్రకటించారు. పూర్తి వివరాల కోసం 7780351078 ఫోన్ నంబరును సంప్రదించాలని, జేఎన్‌టీయూజీవీ.ఈడియూ.ఐఎన్/సర్టిఫికేషన్ కోర్సుల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని సూచించారు.

తాగిన మైకంలో యువకుడి ఆత్మహత్య



తాగిన మైకంలో గొంతు కోసుకొని మృతి చెందిన చంద్రశేఖర్

పార్వతీపురం రూరల్/గుమ్మలక్ష్మీపురం: మద్యం తాగి ఆ మైకంలో తనకు తానే పదునైన చాక్‌తో తోయక చంద్రశేఖర్(32) అనే యువకుడు తన గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడడంతో గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక తాడికొండ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యసేవలు అనంతరం భద్రగిరి సీహెచ్‌సీకు తరలించి వైద్యుల సూచన మేరకు పార్వతీపురం కేంద్ర ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ మృతి చెందినట్టు పార్వతీపురం కేంద్ర ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పుట్టికతోనే వినికిడి, మూగ సమస్యలతో దివ్యాంగుడైన చంద్రశేఖర్ తాగుడుకు బానిస అయ్యాడు. అప్పుడప్పుడు మద్యం మత్తులో మతి భ్రమించినట్టు ప్రవర్తిస్తుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కురుపాం మండలంలోని తెన్నుఖర్జలో తన చెల్లి ఇంటికి వెళ్లి తాగి మద్యం మత్తులో ఉన్న చంద్రశేఖర్‌ను మందలించడంతో తన స్వగ్రామమైన ఎగువతాడికొండకు మూడు రోజుల క్రితం వచ్చి ఎప్పటిలాగే శుక్రవారం మద్యం సేవించి శనివారం వేకువజామున 3గంటల ప్రాంతంలో గొంతుకోసుకుంటూ ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే వైద్యసేవలకు తరలించామన్నారు. మృతుడు తల్లితండ్రులు చిన్నప్పుడే మృతి చెందగా సోదరుడు కిశోర్‌తో కలిసి జీవిస్తున్నాడని తెలిపారు.

పెట్రోల్‌బంకులో తనిఖీలు



పెట్రోల్ కల్తీపై బీపీసీఎల్ సెల్స్ అధికారిని ప్రశ్నిస్తున్న వినియోగదారులు

భోగాపురం: స్థానిక బీపీసీఎల్(భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్)బంకులో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల బీపీసీఎల్ సెల్స్ అధికారి విందూరి అన్విత శనివారం తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఇదే పెట్రోల్‌బంకులో పెట్రోల్ కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనదారుడు సీహెచ్ గోపి.. తాను కొనుగోలు చేసిన పెట్రోల్‌లో నీరు కలిసిదంటూ బంకు వద్ద సిబ్బందితో స్థానికులతో కలిసి వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ సెల్స్ అధికారి బంకును తనిఖీ చేసి, ట్యాంకులో ఎంత పెట్రోల్ ఉంది? పెట్రోల్, డీజీల్ కోసం వచ్చే వాహనదారులు తమ వాహనాలకు ఎయిర్ కొట్టించే మిషన్ పనిచేస్తుందా లేదా, అలాగే వినియోదారులకు తాగునీరు అందుబాటులో ఉందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఇంతలో బంకులో తనిఖీలు జరుగుతున్నట్లు తెలుకున్న స్థానికులు బంకు వద్దకు చేరుకుని బంకులో జరుగుతున్న అవకతవకలపై సమాధానం చెప్పాలంటూ సెల్స్ అధికారిని ప్రశ్నించారు. తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారా ఏంటని సెల్స్ అధికారిని నిలదీశారు. కల్తీ లేని పెట్రోల్, డీజీల్‌ను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె స్పందిస్తూ ఇకపై బంకులో ఎటువంటి కల్తీ జరగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దారు రమణమ్మ, సీఎస్‌డీటీ మురళి, ఆర్ఐ ఇమ్రాన్, బంకు మేనేజర్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



మాట్లాడుతున్న సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్

విజయనగరం టౌన్: స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 151వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్..చర్చి ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటివరకు ఉన్న పరిస్థితులను వివరించారు. చర్చి నిర్మించి 150 ఏళ్లు దాటి 151వ వసంతంలోకి అడుగెడుతుండడం ఆనందంగా ఉందన్నారు. కెనడా మేరీ టైమ్ బాప్టిస్ట్ మహాసభకు చెందిన డాక్టర్ సేన్‌ఫోర్డ్ భీమిలి నుంచి ఇక్కడకు వచ్చి 1875 నవంబర్‌లో ఇక్కడ సంఘాన్ని స్థాపించి, 50 ఏళ్లపాటు క్రైస్తవ ఆధ్యాత్మిక సేవలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. తర్వాత కాలంలో దీనికి సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిగా నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్, బైబిల్ రిఫరెన్స్, పాటల పోటీలు విద్యార్థులకు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గుంటూరు సత్తెనపల్లి డేనియల్ రాజు దైవసందేశం చదివి వినిపించారు. కార్యక్రమంలో సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎం.ఎ.నాయుడు, కార్యదర్శి ఆనందరావు, వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.